# Eenadu

## రైల్వే కొలువులకు వయసు పరిమితి పొడిగింపు

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచంలోనే అతిపెద్ద ఉద్యోగ నియామక ప్రక్రియను చేపట్టిన రైల్వే శాఖ ఎక్కువ మందికి అవకాశం కల్పించేందుకు అభ్యర్థుల వయసు పరిమితిని రెండేళ్లు పొడిగించింది. దక్షిణ మధ్య రైల్వే శాఖ ఈ విషయాన్ని ఒక ప్రకటనలో తెలిపింది. రైల్వేశాఖ మొత్తం 89,409 గ్రూపు సీ, డీ స్థాయి ఉద్యోగాలకు ఇటీవల ప్రకటన జారీ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే విద్యార్హతలను తగ్గించడంతోపాటు పెంచిన రుసుంను పరీక్ష రాసిన వారికి తిరిగి చెల్లిస్తామని ఆ శాఖ ప్రకటించింది. తాజాగా వయసు పరిమితిని కూడా పొడిగించింది. అసిస్టెంట్ లోక్ పైలట్, టెక్నీషియన్ ఉద్యోగాలకు జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 28 నుంచి 30 ఏళ్లకు, ఓబీసీలకు 31 నుంచి 33కు, ఎస్సీ, ఎస్టీలకు 33 నుంచి 35 ఏళ్లకు పొడిగించారు. గ్రూపు డి ఉద్యోగాలకు అన్ రిజర్వ్డ్(జనరల్) అభ్యర్థులకు 31 నుంచి 33, ఓబీసీలకు 34 నుంచి 36, ఎస్సీ, ఎస్టీలకు 36 నుంచి 38కి పెంచారు. తెలుగు సహా మొత్తం 15 భాషల్లో పరీక్షలు నిర్వహిస్తారు. అభ్యర్థి ఏ భాషలోనైనా సంతకం చేయవచ్చు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే గడువును మార్చి 31వ తేదీ వరకు పొడిగించారు.